చెక్‌పోస్టుల పరిశీలన



అడ్డగుట్ట: మూగజీవాల అక్రమ రవాణాను అడ్డుకునేందుకు ఇంటర్ కమిషనరేట్ చెక్‌పోస్టులు ఎంతగానో దోహదపడుతాయని ఈస్ట్ జోన్ డీసీపీ బాలస్వామి అన్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని లాలాగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని మీర్జాలగూడ టీ జంక్షన్, లాలాపేట ఇసుక బావి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులను ఆయన మంగళవారం సందర్శించి వాహనాల సోదాలను పరిశీలించారు. బక్రీద్ పండుగ పూర్తయ్యే వరకు చెక్‌పోస్టులు కొనసాగుతాయన్నారు. ఏసీపీ శశాంక్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ రఘుబాబు, ఎస్‌ఐలు షాహీద్ పాషా, గంగాధర్ ఉన్నారు.

సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయాలి

అడ్డగుట్ట: తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చాలావరకు సీసీ కెమెరాలు పని చేయడం లేదని వాటిపై దృష్టి సారించాలని బీజేపీ సీనియర్ నాయకుడు నర్సింగ్‌రావు కోరారు. ఈ మేరకు గతుకారాంగేట్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. అడ్డగుట్ట, తుకారాంగేట్, ఈస్ట్‌మారేడుపల్లి తదితర ప్రాంతాల్లోని పాడైపోయిన సీసీ కెమెరాలకు మరమ్మతులు చేపట్టాలని అలాగే అవసరమున్న ప్రాంతాల్లో కొత్తవి ఏర్పాటు చేయాలని కోరారు. సుభాష్ బొమ్మ వద్ద ఉన్న కమ్యూనిటీహాల్‌లోని పోలీస్ సబ్ కంట్రోల్ ఔట్‌పోస్టును తొలగించాలని వినతిలో పేర్కొన్నారు. ఆయన వెంట స్థానిక నేతలు గంగారామ్, రాజారామ్, దుర్గాప్రసాద్ ఉన్నారు.

గురుకులాల కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు

పద్మారావునగర్: ఎస్సీ, ఎస్టీ గురుకులాల్లోని విద్యార్థులను అవమానించేలా వ్యాఖ్యలు చేసిన గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిణిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సమితి గాంధీనగర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సీఆర్పీ అధ్యక్షుడు డి. సుదర్శన్‌బాబు, కుర్మ మహేందర్, రాపాక అశోక్, బట్టు కృష్ణ తదితరులు మాట్లాడుతూ.. బాధ్యత గల అధికారిణి కులాలు, మతాలకు అతీతంగా పని చేయాల్సిన హోదాలో ఉండి దళితులను అవమానించేలా మాట్లాడడం ఆమె అగ్రకుల అహంకారానికి నిదర్శమన్నారు. ఆమెపై వెంటనే ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. అలాగే ఆమెను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

మాజీ హోంమంత్రి జానారెడ్డిని కలిసిన నేతలు

లాలాపేట: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ హోం మంత్రి కె. జానారెడ్డిని ఆయన నివాసంలో తార్నాకకు చెందిన పలువురు పార్టీ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీని ఒప్పించి ప్రత్యేక రాష్ట్రం సాధించడంలో జానారెడ్డి పాత్ర ఎంతో కీలకం అని పేర్కొన్నారు. మాజీ పీసీసీ మెంబర్ ఏల్ల బుచ్చిరెడ్డి, రాజశేఖరెడ్డి, చంద్రమౌళి, మల్లికార్జున్‌రెడ్డి, ప్రవీణ్, సత్యనారాయణరావు, మల్లేశ్, పాండు యాదవ్, ఆచార్య నాగార్జున స్వామి తదితరులు ఉన్నారు.

టికెట్ చెకింగ్ స్టాఫ్ సమస్యలు పరిష్కరించాలి

సికింద్రాబాద్: టికెట్ చెకింగ్ స్టాఫ్ సమస్యలు పరిష్కరించాలని దక్షిణ మధ్య రైల్వే మజ్దూర్ యూనియన్ జోనల్ అధ్యక్షుడు కాల్వ శ్రీనివాస్ కోరారు. ఈమేరకు డివిజన్ సీనియర్ కమర్షియల్ మేనేజర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన శిఫాలీ కుమార్‌ను సికింద్రాబాద్‌లోని సంచాలన్ భవన్‌లో మజ్దూర్ యూనియన్ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. కార్యక్రమంలో మజ్దూర్ యూనియన్ డివిజనల్ సెక్రెటరీ రవీందర్, సెక్రెటరీలు యుగంధర్, సమ్మయ్య, వేద ప్రకాశ్, సలీం, శ్రీనయ్య, రాజేశ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హరీష్ రావు జన్మదిన వేడుకలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఆర్ట్స్ కాలేజీ ఎదుట మాజీ మంత్రి తన్నీరు హరీశ్ రావు జన్మదిన వేడుకలను విద్యార్థులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి బొల్లు నాగరాజుయాదవ్, హరీశ్‌రావు అభిమాని అడ్వకేట్ జ్యోతి ఆధ్వర్యంలో వేర్వేరుగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేక్‌కట్ చేశారు. అనంతరం పలు ఉద్యోగాల పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు.

సీఈఓకు జన్మదిన శుభాకాంక్షల వెల్లువ

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సీఈఓ) మధుకర్ నాయక్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. కంటోన్మెంట్ అధికారులు, సిబ్బందితో పాటు పార్టీల నేతలు, కాలనీ, బస్తీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

వర్షాకాలంలో ఇబ్బందుల్లేకుండా చూడాలి

- పెండింగ్ పనులు సత్వరమే పూర్తి చేయాలి
- బక్రీద్ పండుగకు వసతులు కల్పించాలి
- సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే పద్మారావుగౌడ్



వివిధ విభాగాల అధికారుల సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: రానున్న వర్షాకాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా అధికారులు ముందస్తు కార్యాచరణను సిద్ధం చేసుకోవాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ సూచించారు. సీతాఫల్‌మండిలోని క్యాంపు కార్యాలయంలో జీహెచ్‌ఎంసీ, జలమండలి, విద్యుత్, రెవెన్యూ తదితర విభాగాల అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాలాల్లోంచి వరదనీరు సాఫీగా వెళ్లేలా చూడాలన్నారు. రహదారులపై వరద చేరడం, చెట్లు నేలకూలితే తక్షణ చర్యలు చేపట్టేలా సన్నద్ధంగా ఉండాలన్నారు.

అధికారుల తీరుపై అసంతృప్తి..

నియోజకవర్గంలో ప్రస్తుత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనుల విషయంలో ఎమ్మెల్యే అసంతృప్తి వ్యక్తం చేశారు. జీహెచ్‌ఎంసీ తదితర ప్రభుత్వ విభాగాల అధికారులు ప్రోటోకాల్ పాటించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్ని కార్యక్రమాలకు సంబంధించి కార్పొరేటర్లకు సమాచారం ఇవ్వకపోవడం సమంజసం కాదని పేర్కొన్నారు.

పెండింగ్ పనులపై ఆగ్రహం..

అడ్డగుట్ట, లాలాపేట, ఎరుకల బస్తీ ఫంక్షన్ హాళ్ల నిర్మాణాలు, లాలాపేటలో స్విమ్మింగ్ పూల్‌ను వెంటనే పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. లాలాపేట రోడ్డు విస్తరణ పూర్తయినా స్తంభాల తొలగింపు, ఇతరత్రా పనులు చేపట్టకపోవడంతో ప్రయోజనం చేకూరడం లేదన్నారు. సుభాష్ చంద్రబోస్ నగర్, దోబీ ఘాట్‌ల్లో డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపు, సాయినగర్‌లో పనులు వెంటనే పూర్తి చేయాలని సూచించారు.

రుణాల నిబంధనలు సడలించాలి

రాజీవ్ యువశక్తి రుణాలు అందుతున్న తీరును ముషీరాబాద్, మారేడుపల్లి తహసీల్దార్ కార్యాలయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రూ.50 వేల ఆర్థిక సాయం అందించేందుకు పెద్దగా నిబంధనలు లేవని అయితే నియోజకవర్గం నుంచి కేవలం 20 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నట్టు అధికారులు వివరించారు. రూ.2 లక్షలకు పైబడిన రుణాల కోసం ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయని ఇందుకోసం ఆదాయ ధ్రువీకరణలు, బ్యాంకు సిబిల్ స్కోర్ కారణంగా ఆమోదానికి నోచుకోవడం లేదన్నారు. స్పందించిన ఎమ్మెల్యే నిబంధనలు కొంత మేర సడలించి అర్హులకు రుణాలు అందించేందుకు అధికారులు, బ్యాంకర్లు సహకరించాలని కోరారు.

బక్రీద్‌కు ఏర్పాట్లు చేయాలి

బక్రీద్ పండుగకు చిలకలగూడ మున్సిపల్ మైదానంలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. మసీదులు, ఈద్గాల వద్ద పారిశుద్ధ్య పనులు వేగవంతం చేసి సుందరీకరణ చేపట్టాలని సూచించారు. వేలాడుతున్న విద్యుత్ తీగల తొలగింపు, పాఠశాలల వద్ద మౌలిక వసతులు, కొత్త నిబంధనల ప్రకారం పన్నుల మదింపు తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ డి.సుభాష్‌రావు, సూపరింటెండెంట్ ఇంజినీర్ ఆశాలత, తహసీల్దార్ భీమయ్య, కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, లింగాని ప్రసన్నలక్ష్మి, రాసూరి సునీత వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు సుబ్రహ్మణ్యం, వెంకటేశ్, రవీందర్, శ్రీనాథ్, వైద్యాధికారులు డాక్టర్ కే.శ్రీకాంత్, డాక్టర్ వందన, డాక్టర్ జయశ్రీ, డాక్టర్ మారుతీ, విద్యాధికారి ప్రతాప్ రెడ్డి, విద్యుత్ అధికారి మహేశ్, రేషనింగ్ అధికారులు పాల్గొన్నారు.

చేసింది కొంతే..ఇంకెంతో చేస్తా

- చరిత్రలోనే తొలిసారిగా కంటోన్మెంట్‌కు రూ.10 కోట్ల నిధులు
- 10 వేల మందికి పట్టాలు ఇప్పించేందుకు కృషి
- ఏడాది పాలన నేపథ్యంలో 'సాక్షి'తో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేశ్





కంటోన్మెంట్: 'కంటోన్మెంట్ నియోజకవర్గంలో తాను చేసిన అభివృద్ధి కొంతే అని..ఇంకెంతో చేయాల్సి ఉందని' ఎమ్మెల్యే శ్రీగణేశ్ పేర్కొన్నారు. ఆయన ఎమ్మెల్యేగా గెలిచి బుధవారం(నేటి)తో ఏడాది కావస్తున్న నేపథ్యంలో నియోజకవర్గ అభివృద్ధి, ఇతరత్రా అంశాలపై 'సాక్షి'తో మాట్లాడారు.

10 వేల కుటుంబాల్లో సంతోషం నింపుతా..

15 ఏళ్లుగా కంటోన్మెంట్ ప్రజల కష్ట, సుఖాల్లో పాలుపంచుకుంటున్నాను. నియోజకవర్గంలో సుమారు 10 వేల కుటుంబాలు రక్షణ, పౌరవిమానయాన శాఖల స్థలాల్లో నివాసముంటున్నాయి. దశాబ్దాలుగా వీరు పట్టాల కోసం పోరాడుతూనే ఉన్నారు. దీనికి శాశ్వత పరిష్కారమే ధ్యేయంగా ముందుకెళ్తున్నా. అలాగే సీఎం రేవంత్ రెడ్డి సహకారంతో భూ బదలాయింపునకు కేంద్రాన్ని ఒప్పించే ప్రయత్నాలు చేస్తున్నా. ఒకట్రెండు నెలల్లోనే సానుకూల నిర్ణయం వచ్చే అవకాశముంది.

గతంలో తాగునీటి సమస్య..

గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా కంటోన్మెంట్‌లో తాగునీటి సమస్య జఠిలంగా మారింది. రోజుకు 59 లక్షల గ్యాలన్ల నీటిని మాత్రమే సరఫరా చేసేది. ఇటీవల దానిని 69 లక్షలకు పెంచాం. అయితే ఈ నీటిని ఒడిసిపట్టుకుని, సరఫరా చేసేందుకు బోర్డు ఆధ్వర్యంలో సరైన రిజర్వాయర్ల సామర్థ్యం లేదని తేలింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వ నిధులతో రిజర్వాయర్లు, పంప్‌హౌజ్‌లు నిర్మిస్తామని ప్రకటించారు. ఇందుకు స్థలాలు ఇవ్వాలని బోర్డుకు సూచించారు. ఈ మేరకు సీఎం హామీ ఇచ్చారు.

తొలిసారిగా ప్రత్యేక నిధులు..

గత పాలకులు నియోజకవర్గ అభివృద్ధి నిధులు తప్ప కంటోన్మెంట్‌కు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు తీసుకురాలేదు. ఇదే అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లగా రూ.10 కోట్ల ప్రత్యేక నిధులు మంజూరు చేశారు. తాజాగా మడ్‌ఫోర్ట్‌లో స్టేడియం నిర్మాణానికి రూ.23.5 కోట్లు మంజూరయ్యాయి. అన్ని మంత్రిత్వ శాఖల నుంచి కంటోన్మెంట్‌కు నిధులు రాబట్టడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నా.

పరిహారం సొమ్ముతో మౌలిక సదుపాయాలు..

ఎలివేటెడ్ కారిడార్ల కోసం సేకరించిన కంటోన్మెంట్ భూములకు సంబంధించిన పరిహారం రూ.303 కోట్లను కేంద్రం ఖాతాలోకి వెళ్లకుండా ఇక్కడు వెచ్చించేలా రాష్ట్ర ప్రభుత్వం ఒప్పించింది. వాటితో కంటోన్మెంట్‌లో నాలాలు, భూగర్భ డ్రైనేజీలను పూర్తిస్థాయిలో ఆధునీకరించనున్నాం. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం స్ట్రాటజిక్ నాలా డెవలప్‌మెంట్ ప్రాజెక్టు (ఎస్‌ఎన్‌డీపీ)లో కంటోన్మెంట్‌ను అంతర్భాగం చేయలేదు. తాజా పనులతో ఆ లోటు తీరుతుంది. వీటికి తోడు రామన్నకుంట, తిరుమలగిరి చెరువులను ప్రక్షాళన చేసి, మినీ ట్యాంక్ బండ్‌లుగా తీర్చిదిద్దుతాం. ఇప్పటికే తిరుమలగిరిలో పనులు ప్రారంభం అయ్యాయి. మోండా డివిజన్ పరిధిలోనూ ఏడాదిలోనే రూ. 13.8 కోట్లతో సీసీ రోడ్లు, డ్రైనేజీ, జంక్షన్లు, పార్కులు, ఫుట్‌పాత్‌లు ఇతరత్రా అభివృద్ధి పనులు చేపట్టాం.

అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలను ఏర్పాటు చేస్తాం



అంబేడ్కర్ కూడలిలో స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్, అధికారులు

సికింద్రాబాద్ : సొంత నిధులతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్‌ల విగ్రహాలు ఏర్పాటు చేస్తానని సికింద్రాబాద్ ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్ తెలిపారు. జీహెచ్‌ఎంసీ అధికారులు, స్థానిక కార్పొరేటర్ సామల హేమతో కలిసి సీతాఫల్‌మండి కూడలిలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద స్థలాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విగ్రహాల ఏర్పాటుకు అనుగుణంగా కూడలి విస్తరణ, సుందరీకరణ, పచ్చిక బయళ్లను ఏర్పాటు చేయాలని అధికారులను సూచించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఆశాలత, ఈఈ సుబ్రహ్మణ్యం, డీఈ స్వర్ణలత, ఏఈ కౌశిక్, కార్పొరేటర్లు కంది శైలజ, రాసూరి సునీత, లింగాని ప్రసన్నలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.17, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 40, బజ్జీమిర్చి 28, క్యాప్సికం 57, పచ్చకాకర 45, పందిరి బీర 50, క్యాబేజీ 18, క్యారెట్ 35, దొండ 18, గుండుబీన్స్ 115, గింజ చిక్కుడు 75, గోకరకాయ 45, కీర 23, దోసకాయ 18, బీట్‌రూట్ 19, ఉల్లిగడ్డ 20, ఆలుగడ్డ 24, చామగడ్డ 35, మొరంగడ్డ 21, కందగడ్డ 45, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 5–6. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమల్లో ఉంటాయి.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

బన్సీలాల్‌పేట్: గాంధీనగర్‌లోని కురుమ కులస్తుల శ్మశానవాటికను కబ్జా చేసినవారిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర కురుమ సంఘం ఉపాధ్యక్షుడు చీర శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కుర్మ సంఘం నాయకులతో కలిసి జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ రవికిరణ్, సికింద్రాబాద్ తహసీల్దార్ పాండు నాయక్, హైడ్రా ఏసీపీ తిరుమల్‌ను మంగళవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కబ్జాదారులు నకిలీ ధ్రువీకరణ పత్రాలు సృష్టించి మున్సిపల్ నుంచి భవన నిర్మాణ అనుమతులు తీసుకున్నారన్నారు. శ్మశానవాటిక స్థలాన్ని కాపాడాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సునీల్, శివప్రసాద్, నటరాజ్, ప్రవీణ్‌కుమార్, సుశీల్, వినోద్, యశ్వంత్, దినేష్, రాజు, సంతోష్ పాల్గొన్నారు.

టీబీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్పీహెచ్‌ఓ జయశ్రీ

అడ్డగుట్ట: టీబీ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీహెచ్‌ఓ డాక్టర్ రాజశ్రీ సూచించారు. అడ్డగుట్టలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో లాలాపేట టీబీ యూనియన్, గాంధీ హాస్పిటల్ సంయుకాధ్వర్యంలో 'టీబీ ముక్త్ భారత్ అభియాన్' కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. టీబీ లక్షణాలు గల రోగులను గుర్తింపునకు చేపట్టిన ఈ కార్యక్రమం 100 రోజుల పాటు కొనసాగుతుందన్నారు. ముఖ్యంగా బస్తీలు, ఓల్డ్ ఏజ్ హోమ్‌లు, నైట్ షెల్టర్లు లాంటి ప్రాంతాల్లో తిరుగుతూ వ్యాధి లక్షణాలున్న రోగులను గుర్తించి చికిత్స అందిస్తామన్నారు. 2 వారాలకు మించి దగ్గు, సాయంత్ర జ్వరం, బరువు తగ్గడం వంటి లక్షణాలు ఉంటే వెంటనే స్థానిక ఆరోగ్య కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ సరిత, సీనియర్ ట్రీట్‌మెంట్ సూపర్‌వైజర్లు సీవీఎస్. రాజు, జగత్ కుమార్, సుబ్బారావు, జయసింహ, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక

సికింద్రాబాద్: చిలకలగూడ డివిజన్ ఏసీపీగా బాధ్యతలు చేపట్టిన కే.శశాంక్‌రెడ్డిని లష్కర్ జిల్లా సాధన సమితి ప్రతినిధులు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. లష్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్ కుమార్ గౌడ్, మాజీ కార్పొరేటర్ కంది నారాయణ, జిల్లా సాధన సమితి ప్రతినిధులు మిట్టపల్లి బాబురావు, సునీల్ ముదిరాజ్, శైలేందర్, రవీందర్‌సాగర్, అజీజ్, నర్సింగ్ రావు పాల్గొన్నారు.

ఏఏహెచ్‌టీ పాత్ర కీలకం

సికింద్రాబాద్: మానవ అక్రమ రవాణాను అరికట్టడంలో యాక్షన్ అగేన్స్ట్ హ్యూమన్ ట్రాఫికింగ్ ఎంతో కృషి చేస్తోందని దక్షిణ మధ్య రైల్వే సీనియర్ డీఎస్‌సీ దెబస్మిత బెనర్జీ పేర్కొన్నారు. యాక్షన్ అగేన్స్ట్ హ్యూమన్ ట్రాఫికింగ్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్స్ సంయుక్తాధ్వర్యంలో రక్సల్ ఎక్స్‌ప్రెస్‌లో సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. సిర్పూర్ కాగజ్‌నగర్ నుంచి సికింద్రాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న ఏడుగురు బాలురు, ముగ్గురు ట్రాఫికర్లను అదుపులోకి తీసుకున్నారు. ఈ బాలలు ఛత్తీస్‌గఢ్, బీహార్, ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన వారిగా గుర్తించారు. వీరిని బాల కార్మికులుగా మార్చేందుకు ఇక్కడికి తీసుకువస్తున్నట్లు ట్రాఫికర్లు వెల్లడించినట్లు తెలిపారు. ఈ మేరకు ఆర్పీఎఫ్ పోలీసులు బాలలతో పాటు, ట్రాఫికర్లను అదుపులోకి తీసుకుని చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరుపరచినట్లు పేర్కొన్నారు.

మెట్టుగూడ కాజ్‌వే ఆధునీకరణ పనులు పూర్తి



మెట్టుగూడ-చిలకలగూడ రైల్వే వంతెన వద్ద సంబురాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు

సంబరాలు చేసుకున్న బీజేపీ నాయకులు

సికింద్రాబాద్: మెట్టుగూడ-చిలకలగూడ రైల్వే వంతెన ఆధునీకరణ పనులు పూర్తయ్యాయి. రెండు ప్రాంతాల మధ్య రైల్ పట్టాలు ఉండడంతో పూర్వకాలంలో ఏర్పాటు చేసిన చిన్న కాజ్‌వే ద్వారా మాత్రమే ప్రజలు రాకపోకలు సాగించేవారు. అయితే సీతాఫల్ మండి-లాలాగూడ రైల్వేస్టేషన్ల మధ్య అదనపు ట్రాక్ నిర్మాణ పనుల్లో భాగంగా మెట్టుగూడ కాజ్‌వేను పూర్తి స్థాయిలో ఆధునీకరించారు. గతంలో ద్విచక్రవాహనాల రాకపోకలకే పరిమితం అయిన ఈ కాజ్‌వే ప్రస్తుతం కార్లు, జీపులు కూడా వెళ్లేలా రెండు మార్గాలను ఏర్పాటు చేసి ఆధునీకరించారు. వంతెన నిర్మాణం పూర్తి కావడంతో మెట్టుగూడ డివిజన్ బీజేపీ నాయకులు మంగళవారం అక్కడ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షుడు ఆదర్శ్‌ముదిరాజ్ మాట్లాడుతూ.. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు రైల్వే అధికారులు కాజ్‌వేనే విస్తరించారన్నారు. ఈ సందర్భంగా మంత్రి, అధికారులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ నాయకులు శారదా మల్లేశ్, ఎస్ రవీందర్, రాజేశ్‌నాయర్, శ్రీధర్, శ్రీధర్, సాయి గణేశ్ పాల్గొన్నారు.

బక్రీద్‌ను ప్రశాంతంగా జరుపుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ శశాంక్‌రెడ్డి

సికింద్రాబాద్: బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని చిలకలగూడ ఏసీపీ కే.శశాంక్‌రెడ్డి సూచించారు. వారాసీగూడలోని తన కార్యాలయంలో చిలకలగూడ, వారాసీగూడ, లాలాగూడ పోలీస్ స్టేషన్ల పరిధిలోని మసీద్ కమిటీ ప్రతినిధులు, జీహెచ్‌ఎంసీ కార్పొరేటర్లు అధికారులతో మంగళవారం పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేకల విక్రయాలు, మాంసం పంపకాలు జీహెచ్‌ఎంసీ అధికారులు నిర్దేశించిన ప్రాంతాల్లో మాత్రమే చేపట్టాలన్నారు. నిబంధనలకు అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. వారాసీగూడ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్‌రెడ్డి, చిలకలగూడ, లాలాగూడ ఇన్‌స్పెక్టర్లు అనుదీప్, రఘు, కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, జీహెచ్‌ఎంసీ అధికారులు, చర్చి కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించిన బోర్డు అధికారులు



కంటోన్మెంట్: రోడ్డును ఆక్రమించి చేపట్టిన నిర్మాణాల తొలగింపునకు వెళ్లిన బోర్డు అధికారులకు విచిత్ర ఘటన ఎదురైంది. సదరు నిర్మాణంలో ఉన్న పెంపుడు కుక్కలు కూల్చివేతలకు అడ్డు తగిలాయి. దీంతో బోర్డు అధికారులు డాగ్ క్యాచింగ్ సిబ్బందిని రంగంలోకి దింపి పని పూర్తి చేయడం గమనార్హం. వివరాల్లోకి వెళ్తే.. కంటోన్మెంట్ 6 వార్డు అమరజ్యోతి కాలనీలో రోడ్డు వేసేందుకు వెళ్లిన బోర్డు అధికారులు సదరు రోడ్డు ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు. దీంతో సంబంధిత వార్డు ఇంజినీర్ జిష్ణు ఈ విషయాన్ని సీఈఓ మధుకర్ నాయక్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆక్రమణలు తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. పోలీసుల బందోబస్తు మధ్య మంగళవారం కూల్చివేస్తుండగా కుక్కల రూపంలో మరో సవాలు ఎదురైంది. దీంతో కంటోన్మెంట్ డాగ్ క్యాచింగ్ వాహనాన్ని తెప్పించి మరీ పని పూర్తి చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. ఆక్రమణల అంశాన్ని తమ దృష్టికి తీసుకొస్తే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.